రాజీమార్గంతో కేసుల సత్వర పరిష్కారం



లోక్‌అదాలత్‌లో కేసుల వివరాలు వింటున్న స్వరూప

ఆమనగల్లు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజీమార్గం ద్వారా కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చని ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు ప్రధమ శ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప అన్నారు. కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని 113 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఏసీపీ కార్తిక్, సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, బద్యానాథ్‌చౌహన్, ఎస్సైలు వెంకటేష్, శ్రీకాంత్, వరప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లిజగన్, న్యాయవాదులు ఆంజనేయులుయాదవ్, యాదిలాల్, లక్ష్మణ్‌శర్మ, రామకృష్ణ, శేఖర్, కృష్ణయ్య, మల్లేష్, గణేష్, కృష్ణ, శ్రీను తదితరులున్నారు.

399 కేసులు పరిష్కారం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 399 కేసులను పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్ చౌహాన్, జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్ చందలు పాల్గొన్నారు.



కామన్ డైట్ చార్ట్‌ను ప్రదర్శిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, తదితరులు

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తాం

- ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి
- చిలుకూరు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభం

విద్యార్థులతో సీఎం రేవంత్



రంగారెడ్డి అర్బన్/మొయినాబాద్/మొయినాబాద్ రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి, ప్రమాణాలు పెంచాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలం చిల్కూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శనివారం ఆయన విద్యార్థులకు కామన్ డైట్ ప్లాన్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు

- మిగతా 8వ పేజీలో..

విద్యార్థులు బాగా చదవాలి

విద్యార్థులు బాగా చదువుకుని రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని ప్రభుత్వ చిఫ్‌విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. పేద విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచినట్లు తెలిపారు. విద్యార్థులకు మంచి వసతులను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేనూ హాస్టల్లో ఉండి చదువుకున్నా

తాను కూడా ఎస్సీ హాస్టల్లో ఉండి చదువుకున్నానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. తాను చదువుకునే సమయంలో హాస్టల్స్‌లో మంచి భోజనం ఉండేది కాదని.. ఇప్పుడు సన్న బియ్యంతో రుచికరమైన భోజనం ప్రభుత్వం అందిస్తుందన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న చేవెళ్లలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.300 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.200 కోట్లు మంజూరు చేయాలని ఆయన సీఎంను కోరారు.

సమావేశమైన రైతులు, పవర్‌గ్రిడ్ అధికారులు



మార్కింగ్‌ను ఆపకపోతే అడ్డుకుంటాం

హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుపై రైతుల అభ్యంతరం

కడ్తాల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న పంట పొలాల మీదుగా హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయవద్దని కడ్తాల మండల రైతులు పవర్ గ్రిడ్ అధికారులను కోరారు. హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని, పోల్ సర్వే మార్కింగ్‌ను వెంటనే ఆపివేయాలని రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. కడ్తాల మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో శనివారం రైతులు బీదర్ పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ అధికారులతో సమావేశమయ్యారు. కడ్తాల, రావిచెడ్, మక్తమాదారం, కొండ్రిగాని బోడుతండాల రైతులు సమావేశంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సమావేశానికి పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ డీజీఎం సంతోష్‌కుమార్, ఫీల్డ్ ఇంజనీర్ గణేశ్‌లు హాజరయ్యారు. పోల్స్ వేయడానికి చేపడుతున్న మార్కింగ్‌ను వెంటనే నిలిపివేయాలని, అలైన్‌మెంట్‌ను మార్చాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, రావిచెడ్ మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు, రైతులు కోరారు. హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను పంట పొలాల మీదుగా వేయవద్దని అభ్యంతరం తెలిపారు. లేనియెడల పోల్స్ వేయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కడ్తాల గ్రామాన్ని అనుసరించి 66 సర్వేనెంబర్లలోని 150 మంది రైతుల పంట పొలాల మీదుగా 765 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్అండ్‌టీ సంస్థ శ్రీకారం చుట్టి లైన్ మార్కింగ్ చేశారు. బీదర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఏర్పాటు చేసే కొత్త హైటెన్షన్ లైన్‌ను తమ పొలాల మీదుగా ఏర్పాటు చేస్తే రూ.కోట్ల విలువైన భూములు కోల్పోయి రోడ్డున పడుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాములు, జంగయ్య, తిరుపతిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పాండు, పెంటారెడ్డి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేశంపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాటిగడ్డ సమీపంలో ఉన్న కేజీబీవీ కాలేజీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, కేజీబీవీ ప్రత్యేకాధికారి గౌసియాబేగం కోరారు. కాలేజీలో పీజీ సీఆర్‌టీ కామర్స్, పీజీ సీఆర్‌టీ నర్సింగ్ ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని, తాత్కాలిక పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కామర్స్‌కి ఎమ్‌కాం, నర్సింగ్‌కు జీఎన్‌ఎం, లేదా బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులను కేశంపేట కేజీబీవీలో అందజేయ వచ్చని చెప్పారు.







నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- గ్రూప్ 2 పరీక్షకు సర్వం సిద్ధం

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నిఘా నీడలో గ్రూప్ 2 పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థులు నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ అని అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ నిర్వహిస్తారు. అలాగే రెండో రోజు 16వ తేదీన రెండు పేపర్లు ఉంటాయి. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుంది. మొత్తంగా రెండూ రోజుల పాటు నాలుగు పేపర్లు అభ్యర్థులు రాయనున్నారు. అభ్యర్థులను పరీక్షకు ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లో అనుమతిస్తారు. 9.30 గంటల తర్వాత గేట్లు మూసి వేయనున్నారు. ఆలస్యంగా వస్తే అభ్యర్థులను అనుమతి లేదు. పోలీస్, నోడల్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు తమ విధులు నిర్వహించనున్నారు. ఈ గ్రూప్-2 పరీక్షకు జిల్లాలో 90 పరీక్షా కేంద్రాల్లో 56,883 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. మొబైల్ ఫోన్స్ ఎలక్ట్రానిక్స్ వస్తువులు నిషేదం. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు, తదితర మౌలిక వసతులు కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్‌కు అంతరాయం కలగకుండా, పరీక్షలు జరిగే సమయాల్లో అభ్యర్థుల సౌకర్యార్థం బస్సులను నడిపించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కమనీయం... కల్యాణం

- రాంపూర్‌లో కనుల పండువగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి పరిణయం
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు

తలకొండపల్లి , డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కల్యాణం అనంతరం భక్తులు గర్భగుడిలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేపట్టారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా ఆలయ చైర్మన్ జిల్లెల్ల పవన్ కుమార్ రెడ్డి, ఈవో స్నేహలత, ప్రధాన అర్చకులు నర్సింహ్మాచారి, మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, వెంకట్ రెడ్డి, అజీం, డోకూరు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా సెమీ క్రిస్మస్


వేడుకలు



వేడుకల్లో రూపస్, గంధం ఎస్తేరు

ఆమనగల్లు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎంబీ ప్రేయర్ టవర్ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల నేపథ్యంలో చర్చిని శోభాయమానంగా అలంకరించారు. పాస్టర్ జీకే రూపస్, గంధం ఎస్తేరు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రార్థనలు, భజనలు, గీతాలాపనలు చేశారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు.

రాచకొండ కోట



రాచకొండ.. రాజదర్పం

Sunday Special


సహజ సిద్ధ పర్యాటక కేంద్రంగా గుర్తింపు

అలనాటి రాచరిక పాలనకు సాక్షీభూతంగా రాచకొండ ఖిలా నిలుస్తోంది. రాచకొండను రాజధానిగా చేసుకుని గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు పద్మనాయక వంశీయులు. అలనాడు సింహభూపాలునిచే నిర్మించబడిన కోటగోడ, అంతఃపురం, దేవాలయాలు ఒకటేమిటి సుసంపన్న రాజధానికి ఉండాల్సిన అన్ని హంగులూ ఇప్పటికీ గోచరిస్తాయి. ఇంకా కనుచూపు మేరలో కనిపించే కొండకోనలు, నీటి పరవళ్లు, నిండైన చెట్లు చేమలతో పరుచుకుని పచ్చటి హొయలతో నిండి సహజసిద్ధ పర్యాటక కేంద్రంగా చూసేవారిని కట్టిపడేస్తోంది. పర్యాటకులు రాచకొండలో వీక్షించాల్సిన ప్రత్యేక ప్రదేశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం.

- శత్రుదుర్భేద్యమైన రాతి కోటగోడ
- ఏడు ముఖ ద్వారాలతో కొండపై అంతఃపురం
- అంతుచిక్కని సంకెళ్ల బావి రహస్యం
- నేటికీ భక్తులతో కళకళలాడుతున్న ఆలయాలు
- రాచకొండ పర్యాటకంపై ప్రత్యేక కథనం

మంచాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): 14వ శతాబ్దంలో రాచకొండ ప్రాంతాన్ని పాలించిన పద్మనాయక వంశానికి చెందిన రేచర్ల సింహభూపాలుడు రాచకొండ కోటను నిర్మించాడు. ఈ సామ్రాజ్యాన్ని మొదటగా కాకతీయులు, పద్మనాయక వంశీయులు, బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు తదుపరి నిజాం నవాబులు పాలించారు. కాగా పద్మనాయక వంశ పాలకుల సమయమే రాచకొండకు స్వర్ణయుగమని పిలుస్తారు. అలనాడు సింహభూపాలునిచే నిర్మించబడిన కోటగోడ, అంతఃపురం, దేవాలయాలు ఒకటేమిటి సుసంపన్న రాజధానికి ఉండాల్సిన అన్ని హంగులూ ఇప్పటికీ గోచరిస్తాయి. ఏడు ముఖ ద్వారాలతో కొండపై అంతఃపురం నిర్మించారు. వందల ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న ఈ అంతఃపురం చుట్టూ రాతితో కట్టబడిన శత్రుదుర్భేద్యమైన కోటగోడ ఉంది. ఈ ప్రహరీ మొత్తం రాతితో నిర్మించబడి ఉండడం విశేషం. ఒక్కో ముఖద్వారం పరిధిలో ప్రత్యేక నిర్మాణాలు, కొలనులు ఉంటాయి. అంతఃపురం చుట్టూ వేలాది ఎకరాల్లో నిర్మాణాలు, గుళ్లు గోపురాలు నిర్మించబడి ఉన్నాయి. సుమారు 900 ఏళ్ల క్రితం నిర్మించబడ్డ ఈ దేవాలయాలు

- మిగతా 7వ పేజీలో..



అంతఃపురం ముఖద్వారం

నరేందర్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారు

వికారాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి త్వరలోనే నిర్దోషిగా కడిగిన ముత్యంలా బయటకు వస్తారని బీఆర్ఎస్‌కు చెందిన వికారాబాద్ జడ్పీ మాజీ వైస్‌చైర్మన్, మాజీ జడ్పీటీసీలు అన్నారు. నరేందర్‌రెడ్డి సతీమణి శృతిరెడ్డిని వారు శనివారం పరామర్శించారు. లగచర్ల ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గత నెలరోజులుగా రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని నివాసంలో పట్నం శృతిరెడ్డిని జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బైండ్ల విజయకుమార్, మాజీ జడ్పీటీసీలు ప్రమోదినీ, సుజాత, హరిప్రియ, అరుణ దేశునాయక్, నాగరాణి, కోట్ల మహిపాల్‌లతో పాటు నర్మద, శకుంతల, అనురాధ, శోభ, చందు పాషా పరామర్శించి ధైర్యం చెప్పారు.



శృతిరెడ్డిని పరామర్శిస్తున్న జడ్పీమాజీ వైస్‌చైర్మన్, మాజీ జడ్పీటీసీలు





ఇందిరమ్మ కమిటీలతో పారదర్శక పాలన

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేద కుటుంబాలకు అందించేందుకు వారధులుగా ఇందిరమ్మ కమిటీలు పని చేస్తాయని, ఈ కమిటీల ద్వారా గ్రామాల్లో పాలన పారదర్శకంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరంలో కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ నివాసంలో ఏర్పాటుచేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో ఇచ్చిన అర్జీల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి రూ.5లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుందన్నారు. ఇంటి స్థలం ఉన్న వారికి విడతల వారిగా సాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు పనిచేస్తాయన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను పర్యవేక్షించేందుకు మండలాలు, డివిజన్ల వారిగా 5 నుంచి 8 మందిని స్పెషల్ అబ్జర్వర్లుగా పార్టీ నాయకులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఇంటి స్థలం ఉన్నవారికి ఆర్థిక సాయం, స్థలం లేని పేదవారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం తగిన ప్రణాళికలను తయారు చేస్తుందన్నారు. ఇళ్లు ఇప్పిస్తామని పైరవీల పేరుతో ప్రజలను ఎవరైనా మోసం చేయాలని చూస్తే కాంగ్రెస్ సహించదని అన్నారు. నాయకులు ఏనుగు జంగారెడ్డి, కూన యాదయ్య, కాకి ఈశ్వర్, ఇజ్రాయేలు, వి.రఘుపతి, బాల్‌రాజ్, రాజునాయక్, లాజర్, జంగయ్య, పరమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు కొత్త కందులు



ధారూరు, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం కొత్త కందులు(ఎర్రవి) అమ్మకానికి వచ్చాయి. సాయంత్రం మార్కెట్‌లో నిర్వహించిన బీట్లలో కందులు క్వింటాలుకు గరిష్ఠ ధర రూ.9,501, కనిష్ఠ ధర రూ.9,460లు పలికింది. 13 క్వింటాళ్ల కందులు క్రయవిక్రయాలు జరిగాయి. కాగా మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,450 నుంచి రూ.2,490లు, ధాన్యం 1010 రకం క్వింటాలుకు రూ.2,170 నుంచి రూ.2,260 వరకు, సోనా రకం క్వింటాలుకు రూ.2,450 నుంచి రూ.2,690 వరకు ధర పలికిందని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

నేడు పరిగిలో ముగ్గురు మంత్రుల పర్యటన

పరిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిగి నియోజవర్గంలో ఆదివారం(నేడు) ముగ్గురు మంత్రులు పర్యటిస్తారని పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశరాంరెడ్డిలు తెలిపారు. పరిగి మార్కెట్ కమిటీల పాలవర్గాల ప్రమాణస్వీకారం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధరసరి అనుసూయ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యేలు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, బి.మనోహర్‌రెడ్డిలు పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా రూ.5 కోట్లతో నిర్మించనున్న మునిసిపల్ కార్యాలయం, రూ.6.4కోట్లతో చేపట్టనున్న లక్నాపూర్ రోడ్డు, గిరిజన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

కందుకూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాచులూరు మాజీ ఎంపీటీసీ వి.బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ శ్రీనివాసచారిలు కోరారు. శనివారం అవేర్ సంస్థ ఆధ్వర్యంలో రాచులూరులో నిర్వహించిన వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి చేస్తున్నప్పటికీ, ఉచిత వైద్య శిబిరాలు కూడా ఎంతో దోహదపడుతాయని తెలిపారు. కామినేని ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు క్యాంపు నిర్వాహకుడు వెంకన్న తెలిపారు. వైద్యులు డాక్టర్ దేవేంద్ర, డాక్టర్ దీక్షిత, సంస్థ అధికారి పి.వరుణ్ పాల్గొన్నారు.



రాచులూరులో పరీక్షలు చేస్తున్న వైద్యులు


లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి


రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి


రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే డబ్బుతో పాటు సమయం ఆదా అవుతాయని రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌ను ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్‌రెడ్డి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కేసు పరిష్కరించకోవడం ద్వారా సివిల్ కేసులలో చెల్లించిన ఫీజులను తిరిగి పొందవచ్చన్నారు. కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల ప్రాంగణాలలో 30 లోక్‌అదాలత్ బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాదబీమా కేసులు, కన్స్యూమర్ కోర్టు కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించుకున్నారని తెలిపారు. కాగా, క్రిమినల్, సివిల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు అన్ని కలిపి సుమారు 1,48,015 కేసులు పరిష్కరించబడ్డాయి. అన్ని కేసులకు కలిపి రూ.18,72,49,348లు పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించారు. ట్రాఫిక్ కేసులలో రూ.6,34,67,535లు ప్రభుత్వానికి ఇప్పించారు. న్యాయవాదులు సోమయ్య, సుధలతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు, ఇన్సూరెన్స్ అధికారులు, ప్యానెల్ అడ్వొకేట్లు తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి







రాజీపడితే ఇద్దరూ నెగ్గినట్లే

- జిల్లాలో 2,009 కేసుల పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): న్యాయస్థానంలో కేసు గెలిస్తే ఒక్కరే గెలుస్తారని, అదేలోక్ అదాలత్‌లో కేసు రాజీ కుదుర్చుకుంటే ఇద్దరూ నెగ్గినట్లేనని జిల్లా ప్రధాన న్యాయామూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వికారాబాద్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎలాంటి పట్టింపులకు పోకుండా క్షమాగుణాన్ని అలవర్చుకొని కేసులను రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. సమాజంలో నైతిక విలువలు తగ్గిపోవడం కారణంగానే అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. కోర్టులో కేసులేకుండా ఇరువురి మధ్య ఉన్న తగాదాను కూడా ఇరువురిలో ఒకరు అర్జీ పెట్టుకుంటే మరొకరిని కోర్టుకు పిలిపించి రాజీ కుదురుస్తామని తెలిపారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో కుటుంబకలహాలు, భార్యాభర్తల మధ్య తగాదాలు, రహదారి ప్రమాదాలు, ఆస్తి, భూ, ఇతర తగాదాలకు సంబంధించిన 2009 కేసులను రాజీకుదిర్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయామూర్తి చంద్రకిషోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, డీబీ శీతల్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రత్యేక ద్వితీయశ్రేణి న్యాయమూర్తి నామాల అశోక్, జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీపీ సమీనాబేగం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

గత ప్రభుత్వం విద్యావ్యవస్థను పట్టించుకోలేదు

పరిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విద్యావ్యవస్థను పట్టించుకోలేదని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఐదవ మహాసభలు శనివారం పరిగిలో జరిగాయి. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖకు నిధులు పెంచామని తెలిపారు. యూపీఎస్‌ను త్వరలో రద్దు చేయిస్తామని తెలిపారు. గతంలో 15నాటికి కూడా జీతాలు వచ్చేవికాదని, ఇప్పుడు ఒకటో తారీఖుననే పడుతున్నాయని చెప్పారు. విద్యావ్యస్థను గాడిలోపడే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు కోరిన సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, విద్యాకమిషన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, తిరుపతయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరత్నం,రాములు, ఆహ్వానకమిటీ కన్వీనర్ వెంకటయ్య, సంఘం నాయకులు బిచ్చయ్య, జమున, మోహిజ్, మెఘ్యా, శంకర్‌రావు, జైపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్షలో జేఏసీ నాయకులు, మహిళలు

తలకొండపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 44వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జేఏసీ నాయకులు, యువకులు, గ్రామ నేతలు కూర్చున్నారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్ చంద్రలు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రం ఏర్పాటు విషయంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ తీసుకోవాలని అన్నారు. లేని యెడల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. జేఏసీ నాయకులు ఆంజనేయులుగౌడ్, అనిల్, యాదమ్మ, జంగమ్మ, అంజమ్మ, సుగుణమ్మ, కృష్ణయ్య, కుమార్, మాణిక్యం, మహేందర్, లింగయ్య, అల్లావుద్దీన్, గౌస్, అనిల్, జంగయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ ప్రక్షాళన దిశగా అడుగులు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యోగమంటే తనకు ఎనలేని గౌరవం.. మర్యాద అని, అవినీతి లేని ఉద్యోగం అంటే చెప్పుకోదగ్గది ఉపాధ్యాయ వృత్తేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోందని ఆయన అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులతోనే సమాజం చక్కబడుతుందన్నారు. అయితే, దశాబ్ద కాలంలో పాలకులు విద్యావ్యవస్థను విధ్వంసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, అధిక నిధులు సమకూరుస్తుందని చెప్పారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలను తమ ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా బదిలీలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. జీవో 317 వల్లనే ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని, త్వరలోనే విద్యాశాఖను సమగ్రంగా ప్రక్షాళన చేసి అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై ఎర్ర జెండా నిరంతరం పని చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి తెలిపారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అనెక్స్ గ్లాస్ కంపెనీలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.శివయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు, కార్మికులపై దాడులు పెరిగాయని చెప్పారు. కార్మికులంతా ఐకమత్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని సూచించారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రైతులు, కార్మికులు, కర్షకులు శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి కృషి చేస్తా

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

ఘట్‌కేసర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో రైల్వేవంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని చేపట్టిన రిలేనిరాహార దీక్షలు శనివారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంతెన నిర్మాణ పూర్తి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు పరిహారం చేపట్టి, తమకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. గతంలో తమకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని కానీ ఇప్పటికీ స్థలం చూపించలేదని వాపోయారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. అందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

మహానుభావులను ఆదర్శంగా తీసుకోవాలి



వాహనదారులకు హెల్మెట్ అందిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, పాఠశాల కరస్పాండెంట్ హనుమంతరెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలోని మహానుభావులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో అత్యున్నత శిఖరాలకు ఎదగాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి హితవు పలికారు. తూంకుంటలోని శ్రీవిజ్ఞానభారతి హైస్కూల్‌లో కరెస్పాండెంట్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇన్వెస్టిట్యూర్ సెరోమని, రైడ్ టు సేఫ్టీ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ వెంకట్‌రెడ్డి విచ్చేసి రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై పాటించావల్సిన జాగ్రతలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ట్రాక్స్ రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఏసీపీ, శామీర్‌పేట పోలీసు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌లు హెల్మెట్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జంగారెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ వంశీగౌడ్, హెచ్‌ఎం సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త పాలకవర్గంపై

సరికొత్త ఆశలు!

- నేడు ప్రమాణస్వీకారోత్సవం
- ముగ్గురు మంత్రులు, స్పీకర్ రాక
- పరిగిలో రైతు బజారు ఏర్పాటు కలేనా?
- రోడ్డుపై సంతతో తప్పని తిప్పలు



అసంపూర్తిగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు

పరిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలో జరిగే సంతకు ప్రత్యేకస్థలం లేక వ్యాపారులు, ప్రజలు అష్టకష్టాలు పడాల్సివస్తోంది. ప్రతీ శుక్ర, శనివారాల్లో జరిగే మార్కెట్‌ను పట్టణంలోని నడిబోడ్డున ఉన్న ప్రధాన రహదారులపై నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు తప్పడంలేదు. పరిగి మార్కెట్ కమిటీకి ఇటీవల కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఆదివారం(నేడు) పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధరసరి అనుసూయ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యేలు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డిలు హాజరవుతున్నారు. అయితే కొత్త పాలకవర్గంపై పరిగి ప్రాంత రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. గతంలో రోడ్డుపైనే కొనసాగే ఈ సంతను ఏడాదిపాటు మార్కెట్ కమిటీ స్థలంలో కొనసాగించారు. అట్టి స్థలంలో రైతు బజారు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని పాలకవర్గం నిర్ణయించడంతో తిరిగి కూరగాయాల మార్కెట్ నడిపైనే నిర్వహిస్తున్నారు. శుక్ర, శనివారాల్లో నడవడానికి కూడా వీల్లేకుండా ఉంటుంది.



అసంపూర్తిగా షాపింగ్ కాంప్లెక్స్



పరిగిలో రైతుబజారు ఏర్పాటుకు వేసిన శిలాఫలకం

నిలిచిన రైతుబజార్ నిర్మాణ పనులు

2002లో రైతుబజారు ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే కె.హరీశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి శిలాఫలకానికే పరిమితమైంది. గత మార్కెట్ కమిటీ రూ.75లక్షలతో రైతు బజారును, రూ.67లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని నిధులు మంజూరు చేసింది. పనులను టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించించి పనులు ప్రారంభించింది. ఇట్టి స్థలం మాదని కొందరు వ్యక్తులను కోర్టును ఆశ్రయించారు. దీంతో రైతు బజారు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత సమస్య పరిష్కారం కాగా, ఇంటిగ్రేటేట్ మార్కెట్‌ను నిర్మాణ పనులు ప్రారంభించి పిల్లర్ల దశకు చేరుకుంది. గత ఏడాదిగా అంతలోనే నిలిచిపోయింది.

రోడ్డుపై సంతతో ట్రాఫిక్ సమస్య

ఇదిలా ఉండగా, కూరగాయల సంతలు మాత్రం రోడ్డుపైనే కొనసాగుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్ర, శనివారాల్లో నిర్వహించే కూరగాయల సంత అయితే పూర్తి నడిరోడ్డుపైనే నిర్వహించడం వల్ల పాదచారులు సైతం నడువలేని విధంగా మారింది. పరిగి నియోజకవర్గంలోని కులకచర్ల, దోమ, పూడూర్ గ్రామాలకు చెందిన వేలాది మంది వస్తుంటారు. సీసీప్లాట్‌ఫామ్‌లు నిర్మించినప్పటికీ వాటిపై షెడ్లు నిర్మించడం మరిచారు. దీంతో ముఖ్యంగా వర్షాకాలం అయితే నానా అవస్థలు పడాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు.

త్వరలోనే సమస్య పరిష్కారం



రైతుబజారు సమస్య త్వరలోనే పరిష్కారం కానుంది. పెండింగ్‌లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన ఇంటిగ్రేటేట్ త్వరలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులకు విశ్రాంతి భవనం, వేబ్రిడ్జిని ఏర్పాటు చేస్తాం. అదేవిధంగా రైతు బజారు ఏర్పాటు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

- బి.పరశురాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, పరిగి

రైతు బజారులోనే చేపల మార్కెట్ ఉండాలి



పరిగిలో ఏర్పాటు చేసే రైతు బజారులో చేపల మార్కెట్‌ను కూడా ఏర్పాటుచేయాలి. పరిగి ప్రాంతంలో మత్స్యకారులు చాలా ఎక్కువగా ఉంటారు. రైతుబజారును త్వరగా పూర్తి చేసే అందులో మత్స్యకారులకు ప్రత్యేకంగా షెడ్‌లను పూర్తిచేయాలి. రైతులకు విశ్రాంతి భవనం, ఇతర వసతులు కల్పించాలి.

- ఆనెం ఆంజనేయులు, మత్స్యవిభాగం జిల్లా అధ్యక్షుడు పరిగి

రైతు బజారు త్వరగా ఏర్పాటు చేయాలి



పరిగిలో రైతుబజారు త్వరగా ఏర్పాటు చేయాలి. రోడ్డుపై ఇరుకు స్థలంలో నానా ఇబ్బందులు పడాల్సివస్తోంది. మార్కెట్ శాఖ అధికారులు త్వరగా రైతుబజారు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. రైతుబజారులో వ్యాపారులకు కాకుండా రైతులకు అవకాశం ఇవ్వాలి.

- నర్సింహులు, పరిగి

రాచకొండ.. రాజదర్పం

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండడం గమనార్హం.

సంకెళ్లబావిలో నిధి నిక్షేపాలు

రాచకొండ కోట అంతఃపురం ఏడు ముఖద్వారాల్లో చివరి ముఖద్వారం దాటగానే సంకెళ్లబావి ఉంటుంది. ఈ సంకెళ్లబావికి ప్రత్యేకత ఉంది. అంత ఎత్తైన ప్రదేశంలోనూ ఈ బావిలో నీటి నిల్వలు ఉండడం విశేషం. పైగా ఈ బావి లోతు అంతుచిక్కనిదిగా ఉంటుందని చరిత్రకారులు చెబుతున్నారు. ఆనాటి రాజులు తమ నిధి నిక్షేపాలను ఈ బావిలోనే దాచి ఉంచేవారని ప్రసిద్ధి. ఇంకా ఈ బావి నుంచి సొరంగమార్గం తంగెడిపల్లి చెరువుదాకా విస్తరించి ఉంటుందని ప్రచారంలో ఉంది. కొండ కింది భాగంలో స్వయంభు శంభు లింగేశ్వరాలయం ఉంటుంది. దేశంలో మరెక్కడా లేని పరిమాణంలో ఉన్న ఈ శివలింగానికి ప్రత్యేకత ఉంది. ఏటా శివ రాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు.

సేదీ తీరే బోగని మంచం

రాచకొండ కోట కింది భాగంలో అంతఃపురానికి విస్తరించి ప్రజలు నివసించేందుకు ఏర్పాటుచేయబడ్డ అనేక గ్రామాలు ఉంటాయి. అప్పట్లో ప్రజల నివాసం కోసం రాతితో నిర్మించబడిన ఇళ్లు, తాగునీటి బావులు, వంటకోసం వినియోగించే రాతి రోళ్లు తదితరాలన్నీ ఈ ప్రాంతంలో ఇప్పటికీ కనిపిస్తాయి. రాచకొండ కోట, ప్రజల నివాసం సముదాయాల మధ్య నుంచి వాగునీటి సెలయేరు ఎల్లప్పుడూ పారుతూనే ఉంటుంది. ఈ వాగుకు అనుసరించే వర్షాకాలంలో కొండల పైనుంచి జలపాతాలు సందర్శకులను కనువిందు చేస్తాయి. ప్రజావాసాల పక్కనే వీరభద్రేశ్వరస్వామి ఆలయంతో పాటు మరిన్ని దేవతామూర్తుల ఆలయాలు ఉంటాయి. ఇప్పటికీ కుటుంబాలతో సహా భక్తులు ఈ ఆలయానికి చేరుకుని వీరభద్రస్వామికి మొక్కులు తీర్చుకుంటారు. ఇదీగాక రాచకొండ కోటకు దక్షిణ ప్రాంతంలో ఉండే గుట్టపై బోగని మంచం అనే రాతి కట్టడం ఉంటుంది. రాజులు అప్పట్లో ఈ బోగని మంచానికి చేరుకుని సేదతీరి వెళ్లేవారని చరిత్రకారులు చెబుతారు.



గుర్రాల గుట్టపై గల నరసింహస్వామి దేవాలయం

రాచకొండకు ఇలా చేరుకోవాలి..

హైదరాబాద్ నుంచి రాచకొండ కోటకు చేరుకోవాలంటే నాగార్జున సాగర్ హైవే దగ్గరి దారి. హైదరాబాద్ నుంచి సాగర్ హైవేలో 20 కిలోమీటర్ల వెళ్తే ఇబ్రహీంపట్నం వస్తుంది. ఇక్కడి నుంచి 10 కిలోమీటర్లు ప్రయాణించాక మంచాల మండల కేంద్రం వస్తుంది. ఇక్కడి కరెంటు జంక్షన్ మూలమలుపు తిరిగి 6 కిలోమీటర్ల దూరంలోని తిప్పాయగూడ దాటాలి. అక్కడి నుంచి నేరుగా మరో 2 కిలోమీటర్ల తదుపరి సందర్శకులు రాచకొండ కోటకు చేరుకుంటారు.

లక్ష్మీనృసింహస్వామి ఆలయం.. ప్రత్యేకం

రాచకొండ అంతఃపురం కోటలో ఏడు ముఖద్వారాలతో ఒక భాగం కాగా లక్ష్మీనృసింహ స్వామి ఆలయం ఉండే ప్రదేశం మరో భాగం. దీనినే గుర్రాల గుట్టగా పిలుస్తారు. ఈ ప్రదేశం సుమారు వందకు పైగా ఎకరాల్లో విస్తరించి ఉంటుంది. కొండపైనే ఐదు దశాబ్దాలు దాటినా చెక్కుచెదరని రీతిలో రాతితో నిర్మించబడిన నరసింహస్వామి ఆలయం ఉంటుంది. గుడి సమీపంలోనే గుర్రాలు సేదదీరేందుకు నిర్మించిన పెద్ద కొలను ఉంటుంది. అప్పట్లో ఈ గుర్రాల గుట్ట సైనికుల విడిదిగా కూడా ఉండేదని చెబుతారు.



సెలయేటివాగు



చుట్టూ విస్తరించి ఉన్న శత్రుదుర్భేధ్య కోటగోడ

ఏడాదిలోనే రూ.7,333 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గంలో రూ.7333 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగిలోని తన నివాసంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.3100కోట్లతో దామగుండంలో నేవీరాడార్ స్టేషన్, రూ.3000 కోట్లతో రైల్వేలైను పనులు, వెయ్యికోట్ల మన్నెగూడ నాలుగు లైన్‌ల రోడ్డు, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. పరిగి నియోజకవర్గంలో రూ.232 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. రూ.20కోట్లతో పంచాయితీరాజ్‌రోడ్లు, రూ.23కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ రోడ్లు, రూ.20 కోట్లతో తండాలకు తారు రోడ్లకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రూ.10 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులు తీసుకొచ్చానని తెలిపారు. రూ.80కోట్లతో గడిసింగాపూర్, రంగారెడ్డిపల్లి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం జరుగుతుందనానరు. ఒక్క మునిసిపల్‌లోనే రూ.41 కోట్ల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఏడాదిలో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50 కోట్లు ఇచ్చామని తెలిపారు. రూ.8 కోట్లతో జాఫర్‌పల్లి, గోవిందాపూర్, అన్నారెడ్డిపల్లి, వెంకటరెడ్డిపల్లిలో సబ్‌స్టేషన్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్క పరిగిలోనే రైతులకు రూ.295కోట్ల రుణ మాఫీ చేశామని చెప్పారు. ఆరుగ్యారంటీల ద్వారా రూ.350కోట్లు, రూ.4,79కోట్లు గృహజ్యోతి కింద ఇచ్చామని తెలిపారు. ఈ సమావేశంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ పాల్గొన్నారు.

ఏడాదిలో మారనున్న కొడంగల్ ముఖచిత్రం

- సమగ్రాభివృద్ధికి సీఎం ప్రత్యేక ప్రణాళిక
- మెస్‌చార్జీల పెంపుతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో వెనుకబడిన కొడంగల్ ప్రాంతం ఏడాది వ్యవధిలో ముఖచిత్రం మారి అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాలలో శనివారం ప్రభుత్వం పెంచిన మెస్‌చార్జీల నూతన మెనూను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ నాణ్యమైన భోజనం అందించే దిశగా 40శాతం మెస్‌చార్జీలు పెంచడం అభినందనీయమన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే దిశగా ప్రతీరోజు మెనూ ప్రకారం నూతన విధానంతో చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ మెడికల్, వెటర్నరీ, నర్సింగ్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. అదేవిధంగా కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకంతో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరందించేందుకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామాలు, తండాలకు బీటీ రోడ్ల నిర్మాణంతో రవాణా వ్యవస్థ మెరుగుపడనుందన్నారు. 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరాముడిలా పాలన కొనసాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న నల్లచెరువు స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, మార్కెట్‌కమిటీ చైర్మన్లు అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, కౌన్సిలర్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



కొడంగల్‌లో మెస్ చార్జ్స్ మెనూను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి, గురునాథ్‌రెడ్డి, నాయకులు

పాఠశాలలో ఘనంగా ఫుడ్‌ఫెస్టివల్

కొడంగల్‌లోని శ్రీ నేతాజీ విద్యాభవన్ పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి హాజరయ్యారు. పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మణిమాలరెడ్డి, ప్రిన్సిపాల్ వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కామన్ డైట్‌తో విద్యార్థులకు పౌష్టికాహారం

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి):అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు వీలుగా ప్రభుత్వం కామన్ డైట్ ప్లాన్ ను ప్రారంభించిందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా డైట్ చార్జీలు 40శాతం, కాస్మెటిక్ చార్జీలు 200 శాతం పెంచారన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న డైట్ మెనూను వికారాబాద్ జిల్లా ఎన్నపల్లి చౌరస్తాలోని మైనారిటీ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికల)లో ఆయన విద్యార్థులకు నూతన డైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ రూంను సందర్శించి, సన్నబియ్యం, సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ. పెంచిన ధరలకు అనుగుణంగా కొత్త డైట్ మెనూను ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. తద్వారా పిల్లలకు పోషకాలతో కూడిన బలవర్థక ఆహారం అందుతుందని అన్నారు. విద్యార్థులు మరింత మెరుగైన విద్యను అభ్యసించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తన అంతటి వారు కావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, ఆర్డీవో వాసుచంద్ర , కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ ఫాతిమా , మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, ప్రజాప్రతినిదులు , విద్యార్థులు, తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

ముచ్చటించారు. నిత్యం వడ్డిస్తున్న భోజనం గురించి తెలుసుకున్నారు. చిలుకూరు గురుకుల పాఠశాలలో చదువుకుని మద్రాసులో ఐఐటీకి ఎంపికైన వై. సాయిరాం, అమన్, ఉస్మానియ విశ్వవిద్యాలయంలో చదువుతున్న శృతి, హేమంత్, ఎన్‌డీఏకు ఎంపికైన సిద్దార్థ, రాష్ట్ర స్థాయి ఫిజియోథెరపీకి ఎంపికైన బి. దీక్షితకు సీఎం రేవంత్‌రెడ్డి లాప్‌టాప్‌లను అందజేశారు. పాఠశాలలో మృదంగ వాయిద్యం నిర్వహించిన విద్యార్థులను అభినందించారు. పిల్లల్లో మల్టీ టాలెంట్ గుర్తించాలని, వారికి తగిన శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. అలుగు వర్షిణి (ఐఏఎస్), జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మహిళా కమిషన్ చైర్మన్ శోభారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత పెరిగిన డైట్ చార్జీలు

పదేళ్ల తర్వాత 40 శాతం డైట్ చార్జీలలు పెరిగాయని, 15 ఏళ్ల తర్వాత కాస్మెటిక్ చార్జీలు 200 శాతం పెరిగాయని గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ అన్నారు. 3,900 వేల్ఫేర్ హాస్టల్స్‌లో కామన్ డైట్ మెనూ అమలు కానున్నట్లు చెప్పారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచిందని ఆయన అన్నారు. గురుకులాల్లో 8 వేల మంది ఉద్యోగ సిబ్బందిని తీసుకున్నట్లు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను భర్తీ చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

జిల్లాలో..

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం సమీపంలోని చెర్ల పటేల్‌గూడ దగ్గర మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల విద్యాలయాన్ని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాల (నల్లకంచె)ను స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ సందర్శించారు. ఇబ్రహీంపట్నంలోని ఎస్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల/ కళాశాలను మల్టీ జోన్ ఐజీ సత్యనారాయణ సందర్శించారు. వీరు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో డైట్ చార్జీలు 40 శాతం మేర పెంచడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందని, ఇది వారి ఎదుగుదలకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. 16 ఏళ్ల తర్వాత కాస్మెటిక్ చార్జీలు రెండు, మూడు రెట్లు పెరిగాయన్నారు. ఈ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతినిస్తోందని ఈ సందర్భంగా వారు అన్నారు.

కడ్తాల : కడ్తాల మండలం మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం కొత్త మెనూను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఏటీడీవో ఉడుత నూరి వెంకటయ్యలతో కలిసి ఐపీఎస్ అధికారి సునీత మోహన్ ప్రారంభించారు. ఆశ్రమ పాఠశాల గదులు, పరిసరాలు, మరుగు దొడ్లు మూత్రశాలలు, వసతులను ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సునిత మోహన్ భోజనం చేశారు.

చేవెళ్ల : ప్రతీ విద్యార్థి తమ లక్ష్యసాధన కోసం పట్టుదలతో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య సెర్ప్ సీఈవో దివ్యదేవరాజ్ (ఐఏఎస్) తెలిపారు. శనివారం చేవెళ్ల మండల పరిధిలోని ధర్మసాగర్ గ్రామం పరిధిలోఉన్న నవాబ్‌పేట్ బీసీ గురుకుల పాఠశాలను వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి రాష్ట్ర మహిళా సమాఖ్య సెర్ప్ సీఈవో సందర్శించారు. గురుకుల పాఠశాలలోని గదులను, కిచెన్ షెడ్‌లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాగా, విద్యార్థులు బాగా చదువుకోవాలని రంగారెడ్డి జిల్లా హౌసింగ్ పీడీ డీసీ నాయక్ తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని బీసీ గురులకు బాలికల పాఠశాల (మియాపూర్)ను సందర్శించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నూతన మెనూను ప్రారంభించారు. ఎంపీడీవో హిమబిందు, స్పెషలాఫీసర్ దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నర్సింహ ఉన్నారు.



కందుకూరు : సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న దానకిషోర్



ఇబ్రహీంపట్నం : బీసీ గురుకుల(బాలికలు) పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నవీన్ మిట్టల్

మహేశ్వరం : మహేశ్వరంలోని బీసీ గురుకుల పాఠశాలను ఐపీఎస్ అధికారి, ఆంటీ నార్కొటిక్ బ్యూరో సాయి చైతన్య సందర్శించారు. పాఠశాలలోని పరిసరాలతో పాటు వసతిగృహాలు, క్లాస్‌రూమ్‌లు, వంట గదులు, టాయిలెట్స్ డైనింగ్‌హాల్‌ను సుమారు 3 గంటలకు పైగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

కందుకూరు : కందుకూరు మండలంలోని గూడూరు గేటు వద్ద గల సాంఘిక సంక్షేమ పాఠశాల, జూనియర్ కళాశాలను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, గవర్నర్ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతన మెనూను ప్రారంభించి మాట్లాడారు.

యాచారం : విద్యార్థులను సొంత పిల్లలా చూసుకోవాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్‌కుమార్ అన్నారు. యాచారం మండల కేంద్రంలోని బీసీ బాలికల గురుకుల హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాలలను తనిఖీ చేశారు.

శంషాబాద్ : శంషాబాద్‌లోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర హాస్టల్‌లో శనివారం రాష్ట్ర వాణిజ్యపన్నులు, ఎక్సైజ్‌శాఖ కార్యదర్శి రజ్వీ కొత్తడైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న కొత్త మెనూ ప్రకారం వస్తువులు సరిగా రాకపోతే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు.

షాద్‌నగర్ రూరల్ : విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ఏమాత్రం రాజీ పడొద్దని ఐపీఎస్ వీపీ గౌతమ్ సూచించారు. ప్రభుత్వం పెంచిన మెనూ పరిశీలించేందుకు ఆయన నాగులపల్లి శివారులోని మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించారు. బడి పరిసరాలను పరిశీలించి విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. కాగా, గురుకులాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణ శివారులోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన మెనూను శనివారం ప్రారంభించారు. చదువుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందని, సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. పేదపిల్లలు మంచి చదువులు చదవాలని, ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకే సీఎం రేవంత్‌రెడ్డి నాణ్యమైన ఆహారం అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఆర్డీవో సరిత, ప్రిన్సిపాల్ నీతా, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : ఇన్‌చార్జి ఎంపీడీవో గిరిరాజ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌లు శంకర్‌పల్లి ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. వసతిగృహంలో భోజనం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, వైద్యాధికారి రేవతి, వార్డెన్లు ఉన్నారు.

షాబాద్ : మండలంలో మొగిలిగిద్ద, కేరెల్లి, ఆమన్‌గల్ గురుకులాలు, హైతాబాద్‌లోని బాలికల హాస్టళ్లలో అధికారులు మెనూ ప్రారంభించారు. లక్ష్మీనారాయణ డీఎల్‌పీవో కందుకూరు, ఎంపీడీవో అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, రాజేంద్రనగర్, షాబాద్ ఎంఈవోలు శంకర్‌రాథోడ్, లక్ష్మణ్‌నాయక్, గురుకులాల ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

చౌదరిగూడ : విద్యార్థులు వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి అన్నారు. కొందుర్గు ఎస్సీ సంక్షేమ వసతి గృహాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రనగర్ బీసీ గురుకుల పాఠశాలలో అధికారులు మెనూను ప్రారంభించారు. తహసీల్దార్ రమేష్‌కుమార్, జగదీశ్వర్, లక్ష్మిఅనురాధ, ప్రవీణ్‌కుమార్, లాలయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, కృష్ణారెడ్డి, తదితరులున్నారు. ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత ఆమనగల్లు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలలో నూతన మెనూను చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, హెచ్‌డబ్ల్యూవో గోపాల్‌లతో కలిసి ప్రారంభించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ రామేశ్వరి, తదితరులున్నారు. ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతానర్సింహ తలకొండపల్లి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో మెనూను ప్రారంభించారు. మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంజయ్య, తదితరులున్నారు. మాడ్గుల మండలంలోని ప్రభుత్వ వసతిగృహాల్లో ఎంపీడీవో పద్మావతి, డీటీ రాజశేఖర్ రెడ్డిలు సందర్శించి నూతన మెనూను ప్రారంభించారు.

శంషాబాద్ రూరల్ : పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రతిభ కందుకూరు మహాత్మాజ్యోతిబా పూలే, గురుకుల డిగ్రీ, లా కళాశాలలో మెనూను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ప్రొ.జె.విరూపాక్షప్ప, అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు నూతన మెనూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కొత్తూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. కొత్తూర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని చైర్‌పర్సన్‌తో పాటు మండల అధికారులు పరిశీలించి నూతన మెనూను ప్రారంభించారు. జేపీ దర్గా సమీపంలో గల ఎస్టీ గురుకుల రెసిడెన్షియల్ వసతి గృహాన్ని డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య పరిశీలించి మెనూను ప్రారంభించారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కమిషనర్ బాలాజీ, హాస్టల్ వార్డెన్ శ్రీలత, కౌన్సిలర్ సోమ్లనాయక్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేందర్ తదితరులున్నారు.

కేశంపేట : ప్రభుత్వ వసతి గృహాల్లో డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు చారిత్రాత్మకమని కేశంపేట మండల ప్రత్యేకాధికారి రాజారత్నం అన్నారు. కొత్తపేట సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మెనూను ప్రారంభించారు. తహసీల్దార్ మీర్ ఆజంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, తదితరులున్నారు. నూతన మెనూను ఖచ్చితంగా పాటించాలని డీపీవో మల్లారెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు.

మొక్కలు నాటిన అయ్యప్ప భక్తులు

గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా కార్యక్రమం

కడ్తాల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప భక్తులు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం మైసిగండి శివరామాలయాల ఆవరణలో భీముడు గురు స్వామి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌ల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు వివిధ రకాల మొక్కలు నాటారు. భావితరాల మనుగడను దృష్టిలో ఉంచుకొని ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. మొక్కల పెంపకంపైనే పర్యావరణ పరిరక్షణ ఆధారపడి ఉందన్నారు. మొక్కల పెంపకాన్ని ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. మొక్కల పెంపకం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అయ్యప్ప స్వాములను లక్ష్మీనర్సింహారెడ్డి అభినందించారు. భూనాథ్, నరేందర్ రెడ్డి, రాంచంద్రయ్య, వెంకటేశ్, మహేశ్, శ్రీను, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.



మైసిగండి శివాలయం వద్ద మొక్కలు నాటుతున్న అయ్యప్ప భక్తులు

'పట్నం' మార్కెట్ యార్డును మోడల్‌గా తీర్చిదిద్దుతాం : మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డును మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతలకవసరమయ్యే సేవలను విస్తరించాలని సూచించారు. శనివారం మార్కెట్ యార్డులో నూతనంగా ఎన్నికైన చైర్మన్ కంభాలపల్లి గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్‌తోపాటు పాలకవవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని.. ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రజలకిచ్చిన హామీలేగాకుండా అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకుపోతున్నామన్నారు. మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మాణం చేసిన మార్కెట్ కాంప్లెక్స్ మడిగెలకు త్వరలోనే టెండర్లు పిలిచి కేటాయింపులు చేస్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలపించుకునేందుకు కార్యకర్తలు సంసిద్దులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్లు కప్పరి స్రవంతి, మర్రి నిరంజన్‌రెడ్డి, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

వీరేందర్‌రెడ్డి సేవలు మరువలేనివి

కేశంపేట, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ నేత, దివంగత న్యాయవాది తాండ్ర వీరేందర్‌రెడ్డి సేవలు మరువలేనివని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కేశంపేట మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో వీరేందర్ రెడ్డి కుమారుడు శ్రవణ్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. న్యాయవాదిగా వీరేందర్‌రెడ్డి చేసిన సేవలు, స్పాంజ్ ఐరన్ పరిశ్రమలపై అలుపెరగని పోరాటాలను గుర్తుచేశారు. మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తాండ్ర బాల్ రెడ్డి, శేఖర్ పంతులు, రామకృష్ణ, చిన్న, నరేందర్, కృష్ణారెడ్డి, రాంచందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం

తలకొండపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ అన్నారు. మండల కేంద్రంలో శనివారం చైర్‌పర్సన్‌కు మండల కాంగ్రెస్ నాయకుల అధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గీతను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. డైరెక్టర్లు అంజయ్య, అజీం, వెంకటరెడ్డి, నాయకులు విష్ణు, నరేశ్, గణేశ్, డిగ్రీ కృష్ణ, తదితరులున్నారు.



గీతా నర్సింహను సన్మానిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

శంషాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీలోని హనుమాన్ ఆలయంలో శనివారం శివ పంచాయతన సమేత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇటీవల దుండగులు నవగ్రహాలను ధ్వంసం చేయడంతో గ్రామస్తులంతా కలసి సంప్రోక్షన చేసినప్పటికీ ఆ దోశం తొలగిపోవాలంటే.. శివ పంచాయతన సమేత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఈ మహోత్సవం నిర్వహించి విగ్రహాలను పునఃప్రతిష్ఠాపన చేశారు. కమిటీ సభ్యులు, గ్రామస్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



శంషాబాద్ : నవగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, తదితరులు

కనుల పండువగా హనుమాన్ పల్లకీసేవ

షాద్‌నగర్ అర్బన్/షాబాద్ : అయ్యప్ప మాలధారణతో మండలం రోజులు నిష్ఠతో పూజలు చేయడం జన్మజన్మలకు పుణ్యం లభిస్తుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చొడమ్మగుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకీ సేవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కలిసి భజన చేశారు. అక్కడే నిత్యాన్నదానంలో భాగంగా ఎమ్మెల్సీ అయ్యప్పలకు అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ అయ్యప్పలకు అన్నదానం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, ఆలయ అభివృద్ధి కమిటీ కన్వీనర్ పి.శ్రీశైలంగౌడ్, కౌన్సిలర్ ఈశ్వర్ రాజు పాల్గొన్నారు. షాబాద్ మండలం మల్లారెడ్డిగూడలో హనుమాన్ పల్లకీ సేవ నిర్వహించారు. గ్రామస్తులు గోవర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, శేఖర్‌గౌడ్, గణేష్, మాణిక్యం, సత్యనారాయణ, విక్రమ్‌రెడ్డి, సంజీవ, మల్లారెడ్డి, రాజలింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : హనుమాన్ పల్లకీ సేవలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

తలకొండపల్లి : మండల పరిధిలోని వెల్జాల వేదాద్రి గుట్టపై గల శ్రీ వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ సంగీత ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్‌లు హాజరయ్యారు. ముజుబుర్ రహెమాన్, డోకూరు ప్రభాకర్ రెడ్డి, అంబాజీ, కూన రవి, వెంకట్‌రెడ్డి, బాలస్వామి, తదితరులున్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి విరాళాలు

షాద్‌నగర్ అర్బన్ : జానంపేట గుండుకేరిలో హనుమాన్, శివాలయ నిర్మాణానికి దాతలు విరాళాలు ఇచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని భీమారం గ్రామానికి చెందిన ఎల్కుర్తి వీరేశం లక్షా వేయి రూపాయలు, షాద్‌నగర్ పట్టణంలోని ఈశ్వర్‌కాలనీకి చెందిన కొక్కునూరి ప్రవీణ్ రూ.41వేలు, 7వ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్ రాజు రూ.11వేలు, బీఏఎం డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నాగరాజు రూ.11వేలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులను దాతలను అభినందించారు.

సంక్షిప్తంగా..

● **కేశంపేట :** సంతాపూర్ గ్రామంలోని పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటానని, కలమతాలకు అతీతంగా పుస్తె, మెట్టెలను అందిస్తానని ముస్లిం యువకుడు సాజిద్ తెలిపారు. మండల పరిధిలోని సంతాపూర్ గ్రామానికి చెందిన కె. అనసూజ కోడలు భార్గవి వివాహానికి శనివారం సాజిద్ పుస్తె, మెట్టెలు అందించారు. గ్రామంలో నిరుపేదల ఆడబిడ్డల పెళ్లికి పుస్తె, మెట్టెలు అందిస్తానని తెలిపారు. గ్రామస్తులు బద్రప్ప, సాయిరెడ్డి, సురేష్, సావిత్రి పాల్గొన్నారు.

● **కడ్తాల్ :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అలవరుచుకొని లక్ష్యసాధనకు పట్టుదలతో ముందుకు సాగాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతుల కల్పనకు ప్రభుత్వానికి తోడు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పూర్వ విద్యార్థులు చేయూతనందించాలని ఆయన కోరారు. కడ్తాల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో పరేడ్ బ్యాండ్ కొనుగోలుకు జీఎల్ఎన్ రెడ్డి రూ.10 వేలు శనివారం వసతి గృహ అధికారి రాములుకు అందజేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, ఎంపీడీవో సుజాత, ఏవో శ్రీలత, హెచ్‌డబ్ల్యూవో రాములు, నాయకులు మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, రామచంద్రయ్య రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

● **శంషాబాద్ రూరల్ :** గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయికి అలవాటుపడిన ఎంతో మంది యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. ఈ గంజాయి విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో కిలోకు రూ.5వేల చొప్పున కొనుగోలు చేసి తెలంగాణ ప్రాంతానికి దిగుమతి చేస్తున్నారని ఆరోపించారు. గంజాయి మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

● **ఆమనగల్లు :** లయన్స్ ఇసామి ఫోరం అత్యున్నత సమావేశం ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ ఫోరం కార్యదర్శి సందడి నరేందర్‌రెడ్డి, జిల్లా గవర్నర్ కోటేశ్వర్ రావు, మాజీ గవర్నర్ చెన్నకిషన్ రెడ్డిలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివిధ దేశాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో వ్యక్తి మృతి

● బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తుండగా ఘటన



బుచ్చయ్య మృతదేహం

చేవెళ్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): బస్సు కోసం ఎదురుచూస్తున్న వ్యక్తికి గుండెపోటు రావడంతో కూర్చున్న చోటే మృతిచెందాడు. ఈ సంఘటన చేవెళ్ల ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకన్నగూడ గ్రామానికి చెందిన దన్నారం బుచ్చయ్య(55) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి రాకుండా వికారాబాద్‌లో ఉన్న ఆయన చిన్నమ్మ శాంతమ్మ వద్దకు వెళ్లి తిరిగి శనివారం ఉదయం చేవెళ్ల బస్‌స్టాండ్‌కు చేరుకున్నాడు. ఈక్రమంలో తన ఇంటికి వెళ్లేందుకుగాను చేవెళ్ల బస్‌స్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తుండగా కూర్చున్నచోటే గుండెపోటు వచ్చి మృతిచెందాడు. గమనించిన ప్రయాణికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భూపాల్‌శ్రీధర్ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి..



షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుచ్చిగూడ శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి బుచ్చిగూడ శివారులోని రైస్‌మిల్ సమీపంలో అచేతన స్థితిలో పడి ఉన్నాడు. అయితే అతడిలో ఏమాత్రం చలనం లేకపోవడంతో చనిపోయాడని అను మానించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహన్ని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, మృతుడి శరీరంపై గోధుమ, నలుపు రంగు టీ షర్టు, నలుపు ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగినిగా పని చేస్తున్న ఓ యువతి అద్దె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని లాతుర్‌కు చెందిన పంకజ విష్ణు అకుస్కర్(30) కొంత కాలం నుంచి జీఎంఆర్ ఎయిర్‌పోర్టులోని ఏరోస్పేస్ సఫ్రాన్‌లో ఉద్యోగినిగా పని చేస్తోంది. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం అద్దె ఇంట్లో పంకజ ఫ్యాన్‌కు ఉరేవేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారి వచ్చి పరిసరాలను పరిశీలించగా.. మరాఠీ బాషలో ఉన్న సూసైడ్ నోట్ లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. ఎఫ్ఐఆర్ కాలేదని కుటుంబ సభ్యులు వచ్చిన తరువాత ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. సూసైడ్ నోట్‌లో ఏం రాసిందో తెలియాలంటే వారి కుటుంబ సభ్యులు రావాలని పోలీసులు సీజ్ చేశారు.



లోకేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యాచారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారికి వేతనాలు ఇవ్వడానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని సంక్షేమ హాస్టళ్ల సందర్శనకు వచ్చిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్‌ను యాచారంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి బెనిఫిషయర్ కింద రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 20 తరువాత నిరవధిక సమ్మెకు దిగుతామని పేర్కొన్నారు. కారుణ్య నియామకం వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు పి.బ్రహ్మయ్య, పోచమోని కృష్ణ, చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు నాయకుల సన్మానం



శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నసీరుద్దీన్ తదితరులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నార్సింగ్ మార్కెట్ నూతన కమిటీని ఎన్నికున్నారు. శంషాబాద్ మండలం, పెద్దగోల్కొండకు చెందిన అనేగోని శ్రీకాంత్‌గౌడ్‌కు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ మాజీ జనరల్ సెక్రటరీ మహ్మద్ నసీరుద్దీన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ జనరల్ సెక్రటరీ గుంటి ప్రవీణ్‌కుమార్, మన్నే మధు శ్రీకాంత్‌గౌడ్‌కు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రెండుసార్లు డైరెక్టర్‌గా ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మెతావలి మహ్మద్ ఖాజా పాషా, భీమ్‌రావు, సీనియర్ పాత్రికేయులు మధు, సోహల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ న్యాయాధికారి సాంబశివరావు

చేవెళ్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని రిటైర్డ్ న్యాయాధికారి సాంబశివరావు తెలిపారు. ట్రాఫిక్ పోలీస్‌ల ఆధ్వర్యంలో శనివారం చేవెళ్ల కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మొత్తం 521 కేసులు పరిష్కరించడంతో పాటు రూ.8,23,300 జరిమానా విధించడం జరిగిందన్నారు. మద్యంతాగి డ్రైవ్ చేయడం నేరమన్నారు. నిబంధనలకు లోబడి నడుచుకోవాలని ఆయన సూచించారు. సీనియర్ సూపరింటెండెంట్ మహిపాల్, సూపరింటెండెంట్ బి. కృష్ణవేణి, న్యాయవాదులు బి. సత్యానందం, కుమార్, మల్లేష్‌గౌడ్, ఆనంద్, ప్రవీన్, సిబ్బంది పాల్గొన్నారు.